# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 26-11-2025 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ప్రతీ ఒక్కరికీ ఓటు హక్కు కల్పించిన ఘనత భారత రాజ్యాంగానిదేనని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.
- గ్రామీణ ప్రాంతాలలో మౌలిక సదుపాయాలను కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తోందని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు.
- రోడ్డు ప్రమాదాలపై థర్డ్ పార్టీ ద్వారా ఆడిటింగ్ నిర్వహించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.
- అభివృద్ధి పనులకు సంబంధించి రూపొందించే అంచనాలలో ఖచ్చితత్వం ఉండాలని రాష్ట్ర శాసనసభ అంచనాల కమిటీ ఛైర్మన్ వేగుళ్ల జోగేశ్వరరావు కోరారు.
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ "మన్ కీ బాత్.." కార్యక్రమం 128వ సంచిక ఈనెల 30న ప్రసారమవుతుంది.

===============

రాజ్యాంగం గొప్పతనాన్ని ప్రతీ పౌరుడికీ అర్థమయ్యేలా చెప్పాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అమరావతిలో నమూనా అసెంబ్లీని ఈ రోజు నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన విద్యార్థినీ విద్యార్థులు ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... ప్రతీ ఒక్కరికీ ఓటు హక్కు కల్పించిన ఘనత భారత రాజ్యాంగానిదేనని వెల్లడించారు. అయితే బాధ్యతలు నిర్వర్తించకుండా హక్కుల కోసం మాత్రమే పోరాడటం సబబు కాదని తెలిపారు. రాజ్యాంగం కంటే ఎవరూ గొప్పకాదనే విషయం ప్రతీ ఒక్కరూ గ్రహించాలని చంద్రబాబు నాయుడు పేర్కొంటూ...

(వాయిస్ 29 సెకన్లు)

===============

గ్రామీణ ప్రాంతాలలో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ చెప్పారు. డాక్టర్ బీ. ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా రాజోలు నియోజకవర్గంలోని శివకోడు గ్రామంలో పల్లె పండుగ 2.0 పేరిట జరిగిన కార్యక్రమంలో ఆయన ఈ రోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బహిరంగ సభలో మాట్లాడుతూ... పల్లెలను ప్రగతి పథంలో నడిపించేందుకు పల్లె పండుగ కార్యక్రమాన్ని ప్రభుత్వం గత ఏడాది ప్రారంభించిందని గుర్తు చేశారు. దానికి కొనసాగింపుగా ఈ ఏడాది కూడా పల్లె పండగ 2.0 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. గ్రామాలలో రహదారుల నిర్మాణానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని వెల్లడించారు. అంతకు ముందు శంకరగుప్తం గ్రామంలో డ్రెయిన్ బాధిత కొబ్బరి రైతులతో ముఖాముఖిలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి కోనసీమ కొబ్బరి రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొంటూ...

(వాయిస్ 31 సెకన్లు)

================

రాష్ట్రంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై థర్డ్ పార్టీ ద్వారా ఆడిటింగ్ నిర్వహించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో రోడ్ సేఫ్టీ కౌన్సిల్ సమావేశం ఈ రోజు జరిగింది. ఈ సమావేశానికి రవాణా శాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... రహదారి ప్రమాదానికి కారణం వాహనమా, డ్రైవరా, లేక రోడ్డు ఇంజనీరింగ్ లోపమా అన్న అంశాలను గుర్తించేలా ఆడిటింగ్ జరగాల్సి ఉందని స్పష్టం చేశారు. రాష్ట్ర, జిల్లా స్థాయిలలో రోడ్ సేఫ్టీ ఏజెన్సీల నియామకం, రాష్ట్ర రహదారి భద్రతా నిధి, రహదారులపై బ్లాక్ స్పాట్స్‌ను సరిదిద్దటం, ప్రమాదాలను నివారించేలా క్రాష్ బారియర్స్, డ్రైవర్లకు శిక్షణా కార్యక్రమాలు తదితర అంశాలపై ముఖ్యమంత్రి సమీక్షించారు. అతి వేగాన్ని నియంత్రించేందుకు వీలుగా ట్రాన్స్‌పోర్టు వాహనాల్లో స్పీడ్ గవర్నర్‌లను నిబంధనల మేరకు ఏర్పాటు చేయాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు.

విరామం

================

అభివృద్ధి పనులకు సంబంధించి రూపొందించే అంచనాలలో ఖచ్చితత్వం ఉండాలని రాష్ట్ర శాసనసభ అంచనాల కమిటీ ఛైర్మన్ వేగుళ్ళ జోగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే నిధులను ఆయా అభివృద్ధి పనులకు పూర్తిగా వినియోగించాలని కోరారు. కమిటీ సభ్యులతో కలిసి విశాఖపట్నంలో ఈ రోజు పర్యటించిన ఆయన స్థానిక కలెక్టరేట్ మీటింగు హాలులో వివిధ విభాగాల అధికారులతో సమావేశం నిర్వహించారు. 2019-20, 2020-21, 2021-22 ఆర్థిక సంవత్సరాలలో జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులు, రూపొందించిన అంచనాలు, వ్యయం తదితర అంశాలపై ఈ సందర్భంగా అధికారులతో చర్చించారు. క్షేత్రస్థాయి పరిస్థితులు, అవసరాలకు అనుగుణంగా రూపొందించే అంచనాలతోనే సత్ఫలితాలు సాధ్యమవుతాయని ఛైర్మన్ పేర్కొన్నారు. జిల్లాలో చేపట్టిన ప్రాజెక్టులను కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, ఆయా విభాగాల అధికారులు కమిటీకి వివరించారు.

================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 128వ సంచిక ఈనెల 30వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్ర మోదీ యాప్‌కు ఈనెల 28వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

================

ఎటువంటి వివక్ష లేకుండా ప్రజలందరూ హక్కులు పొందేలా భారత రాజ్యాంగాన్ని రూపొందించారని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పి.వి.ఎన్. మాధవ్ పేర్కొన్నారు. విజయవాడ రాష్ట్ర కార్యాలయంలో ఈ రోజు జరిగిన సంవిధాన్ దివస్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ... దేశ ప్రజలందరికి సమాన హక్కులు, న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం రాజ్యాంగం అందించిందని గుర్తు చేశారు. దేశాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన తెలియచేస్తూ...

(వాయిస్ 27 సెకన్లు)

================

గోవాలో జరుగుతున్న భారత అంతర్జాతీయ చలన చిత్రోత్సవం (ఇఫీ) 2025 ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రదర్శించిన రాష్ట్ర శకటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చలన చిత్ర టి.వి. నాటకరంగ అభివృధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కె.ఎస్. విశ్వనాథన్ ఈ రోజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20 నుండి 28వరకు భారత అంతర్జాతీయ చలన చిత్రోత్సవాలు నిర్వహిస్తున్నారని చెప్పారు. కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ సెక్రటరీ సంజయ్ జాజు ఆహ్వానం మేరకు ఆంధ్రప్రదేశ్ చలన చిత్ర టి.వి నాటకరంగ అభివృధి సంస్థ నుండి మొట్ట మొదటిసారిగా `The Heart Beat of Indian Cinema and Tourism` ఇతివృత్తంతో ప్రత్యేక శకటాన్ని ప్రదర్శించామని చెప్పారు. అదే విధంగా రాష్ట్రంలోని సినిమా షూటింగ్ ప్రాంతాలకు సంబంధించిన ఛాయా చిత్రాలను శకటం ద్వారా ప్రదర్శించామని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

================

మలక్కా జలసంధిపై నిన్నటి అల్పపీడనం పశ్చిమ దిశగా కదిలి, తీవ్ర అల్పపీడనంగా మారిందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. నిన్న అదే ప్రాంతంపై పశ్చిమ దిశగా కదులుతూ, మలక్కా జలసంధి దానికి ఆనుకుని ఉన్న ఈశాన్య ఇండోనేషియా మీదుగా "సెన్యార్" తుఫానుగా బలపడింది. ఈ తుఫాను ఈరోజు ఉదయం 5 గంటల 30 నిమిషాల సమయంలో ఇండోనేషియా తీరాన్ని దాటిందని పేర్కొంది. ఇది పశ్చిమ నైరుతి దిశగా కదులుతూ రేపు తెల్లవారుజాము వరకు తీవ్రతను కొనసాగించే అవకాశం ఉందని తెలిపింది. తదుపరి 24 గంటల్లో క్రమంగా బలహీన పడుతుందని వెల్లడించింది.

================

వన్ క్లాస్.. వన్ టీచర్.. విధానాన్ని పాఠశాలల్లో తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని రాష్ట్ర విద్యా శాఖా మంత్రి నారా లోకేశ్ తెలిపారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అమరావతిలోని విద్యార్థులతో నమూనా అసెంబ్లీని ఈ రోజు నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ... పిల్లలకు అర్థం అయ్యే రీతిలో బాలల భారత రాజ్యాంగాన్ని పుస్తక రూపంలో తెచ్చామని చెప్పారు. రాజ్యాంగం భారతదేశపు ఆత్మ అని ఆయన పేర్కొంటూ.. మహాత్మాగాంధీ, జవహార్ లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్, మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ వంటి వారి గురించి ఈ పుస్తకంలో కథనాలు ఉంచామని వెల్లడించారు. చిన్నప్పటి నుండే రాజ్యంగం గురించి ప్రతి ఒక్కిరికీ తెలిసేలా చేయాలని మంత్రి పేర్కొన్నారు.

================
================